


ప్రపంచం నిద్రపోతోంది.

ఆ నిద్రకు రూపాలు అనంతం

అందంగా—వికృతంగా

ఆర్భాటంగా—ఆవేదనగా

మత్తుగా—అలసటగా

ఆశల్ని మేస్తూ—నిరాశల్ని కక్కుకుంటూ.

అనుభవం చివుళ్ళని తుంచుకుంటూ-ఆకలి మొదళ్ళని తెంచుకుంటూ.

నిద్రపోనిదల్లా ఆ గదీ—

గదిలోని గడియారం—

గడియారంలాంటి మనుష్యులూ.

కాలం గుండెకాయ గడియారంముళ్ళ

మధ్య చిక్కుకుని బిక్కు బిక్కుమంటూ కొట్టుకుంటోంది.

సృష్టిలోని చీకటినంతా చీపురుతో చిమ్మి, అక్కడే పారబోసినట్లు ఆ గదంతా నల్లగా, నల్లనల్లగా ఉంది.

నల్లటి ఆ గదిలో చీకటి నీడల్లా ముగ్గురు.

గడియారం పన్నెండుసార్లు నిట్టూర్చింది, మార్చి మార్చి ఆ ముగ్గుర్నీ చూస్తూ.

కాళ్ళకట్ట తెగిపోయిన నులకమంచంలో వెల్లెకిలా పడుకున్న పరశురామయ్య తదేకంగా చూస్తున్నాడు ఇంటికప్పు కేసి. పై కప్పు కన్నంలోంచి, ఓ వెన్నెల కిరణం పరశురామయ్య కంట్లో ప్రతిఫలించాలని ప్రయత్నించింది. కాని, గబ్బిలం కాబోలు అడ్డంవచ్చి కప్పుదగ్గరే ఆగిపోయింది జాలిగా చూస్తూ.

గుమ్మానికి చెరో ప్రక్కా జారగిలబడి కూర్చున్నారు కన్య, కుమార్‌లు.

వాళ్ళ ముగ్గురి మనసుల్లోనూ తీవ్రమైన అలజడి.

ఒకరితో ఒకరు మాట్లాడుకునే ధైర్యం లేదు.

ఆ మనసుల్లో భాషకందని భావాలే తప్ప- మాటలు లేవు. ఉన్నా అవి వినిపించవు.

అందుకే మౌనం 'మొనార్క్'లా ఆ చీకటి గదిని ఏలుతోంది.

ఎవరి ఆలోచనలో వాళ్ళు ఈదుతూ——

ఎవరి ఏకాంతాన్ని వాళ్ళు మోసుకుంటూ——

సమాధానం వెతుక్కుంటున్న ప్రశ్న——

కనీసం రేపటి ఇంటర్వ్యూలోనైనా కుమార్‌కు ఉద్యోగం రాకపోతే !

ఆ ప్రశ్నకు సమాధానం అందులోనూ తృప్తికరమైన సమాధానం ఖరీదు చాలా ఎక్కువని వాళ్ళు ముగ్గురికీ తెలుసు.

నేడో, రేపో రిటైర్ అవబోతున్న పరశురామయ్య——

స్త్రీత్వం సంతరించుకుని పదేళ్ళైనా కన్యగానే మిగిలిపోయిన కన్య——

రాత్రింబవళ్ళు శ్రమించి ఫస్టురాంక్‌లో పట్టా పుచ్చుకున్న తర్వాత అయిదేళ్ళుగా నిరుద్యోగిగా తిరుగుతున్న కుమార్.

ముగ్గురూ

పగలు కలలుకనే ధైర్యంలేక-నిద్రరాని కళ్ళతో చీకటి రాత్రిని అర్థిస్తున్నారు సమస్యకు సమాధానం చెప్పమంటూ.

నాకేం తెలుసు? మీరే వెతుక్కోండంటూ వెకిలిగా నవ్వింది చీకటిరాత్రి.

గదిలోని గడియారం మాత్రం తను నిమిత్తమాత్రురాలినన్నట్లు క్షణాల్ని ముడి వేస్తూ 'కాలం' చాంతాడును పేనుతోంది.

౦ ౦ ౦

ఏదో లేవోయ్ పరశురామయ్యా! గుడ్డిలో మెల్లన్నట్లు-మన డిపార్టుమెంట్‌లో సర్వీసులో ఉండగా గుటుక్కుమంటే, మన పిల్లలకి ఉద్యోగం అంటూ ఏదో ఒకటి ఇస్తారు. ఇది కొంత నయం-మన తర్వాత పెళ్లాం బిడ్డలు వీధిన పడకుండా "

తోటి గుమస్తా సుందర్రామయ్య అన్న మాటలు పరశురామయ్య చెవుల్లో ప్రతిధ్వనించాయ్!

అంటే—అంటే నేను సర్వీసులో ఉండగానే చనిపోతే

ఆలోచనా తరంగం లేపిన అలజడికి-అంతరంగం సముద్రంలో షార్క్‌లా ఒక్కసారి ఎగిరిపడింది.

పరశురామయ్య ఊహలు చదువుతున్న గోడగడియారం ఒక్కక్షణం విస్తుబోయింది.

అవును అంతే చెయ్యాలి కళ్ళు మూసుకుని తన బ్రతుక్కి-మరణానికీ మధ్య నున్న సరిహద్దురేఖను చెరుపుకోగలిగితే కుమార్‌కు ఉద్యోగం


ప్రతిక్షణం వాడి జీవితంలో నవతోరణరేఖ నవ్వుతుంది

తమ్ముడు ఉద్యోగంచేసి దుర్భరమైన తన జీవితానికి ఓ అర్థం, పరమార్థం కల్పిస్తాడని నమ్ముకున్న వెర్రితల్లి ఆశ నెరవేరుతుంది

కాని, ఈ సంగతి వాళ్ళకు తెలిస్తే ?

అబ్బే ఎందుకు తెలుస్తుంది

తెలియకుండా, అతిసహజంగా, క్షణకాలంలో




జరిగిపోయేందుకు ఎన్ని మందులు లేవు

గోడగడియారం భయంతో ఒక్కసారి గుండె బాదుకుంది

సమయం రాత్రి ఒంటి గంట—!

* * *

యూనివర్శిటీలో కాన్వొకేషన్ రోజున గోల్డ్ మెడల్ యిస్తూ-తనని ప్రశంసించిన సన్నివేశమూ-ఆ ప్రశంసల పలకరింపులూ-కళ్ళ ముందు కదిలాయ్ కుమార్‌కు వెర్రిగా నవ్వుకున్నాడు

ఇరవై ఇంటర్వ్యూలలో పనికిరాని డిగ్రీ-కనీసం రేపటి యింటర్వ్యూలోనైనా పనికొస్తుందా గోల్డ్‌మెడలిస్ట్ కుమార్‌కు ?

"ఇటీజ్ డామ్ క్రిపిల్డ్ డిగ్రీ క్రిపిల్డ్ క్రిపిల్డ్

అనాలోచితంగా దొర్లిన తన ఆలోచనను ఆతృతగా మళ్ళీ మళ్ళీ వెతుక్కున్నాడు కుమార్

చటుక్కున మనసులో ఓ ఫ్లాష్ వెలిగింది

అన్నట్లు-క్రిపల్డ్ కాండిడేట్స్‌కు రిజర్వేషన్స్ ఉన్నాయి కదూ?!

యస్ తనూ వాళ్ళలో ఒకడెందుక్కకూడదు? ఎందుక్కకూడదు??

అతని ముఖంలో కండరాలు ఒక్క క్షణం బిగుసుకుని అంతలోనే యీజ్ అయ్యాయి

నో అదర్ వే ఓ చెయ్యి లేకున్నా ఫర్వాలేదు. నాన్న ఇంకో నాలుగైదు నెలల్లో రిటైరై పోతారు ఆ తర్వాత భుక్తి ? తన మీదే ఆశలు పెంచుకు బ్రతుకుతున్న కన్యక్క పెళ్ళి—

సమస్యకు పరిష్కారం దొరికినట్లు, తృప్తిగా కళ్ళు మూసుకున్నాడు కుమార్

ఈ ఘోరాన్ని భరించలేనట్లుగా, చీకటి తలుపుల్ని మరో రెండుమార్లు గట్టిగా తట్టింది గడియారం

సమయం—రాత్రి రెండు గంటలు !

* * *

కుష్కంగా నవ్వుకుంది కన్య తనలో తను

బాగా ఆలోచించే, పుట్టినపుడే, తన నూరేళ్ళ బ్రతుకు భవిష్యత్తునూ బేరీజువేసే పెట్టారేమో తనకు పేరు

తోటివాళ్ళయిన దత్తుడిగారి పార్వతీ, శారదా, విజయకుమారీ, ఇల్లాళ్ళయి ఇద్దరు ముగ్గురు పిల్లల తల్లులయ్యారు తను మాత్రం

యింకా కన్యే !

"ఇప్పుడు సమస్య నువ్వు 'కన్యవా-తల్లివా' అనికాదు. ఇందాక మీరు ముగ్గురూ అడిగారే-కుమార్ ఉద్యోగం సంగతి-అదుగో అదీ!" అంటూ కళ్ళమీద సూదులు పొడిచింది చీకటి.

భయంతో ప్రక్కకు తిరిగి చూసింది కన్య.

లీలగా తమ్ముడి ఆకారం కన్పించింది.

ఆమె మనసు కరిగిపోయింది

"నాన్న రిటైరైపోతే, ఉద్యోగంలేని తమ్ముడూ-పెళ్లి కాని తనూ-తమని వేటాడే ఆకలీ !"

కళ్ళనిండా నీళ్ళు నిండాయి.

తనేం చేయగలదు ఈ పరిస్థితుల్లో? ఏం చేస్తే తమ్ముడికి ఉద్యోగం దొరుకుతుంది?? అసలేం చాతనవును తనకు???

ఉన్నదల్లా కేవలం అడవికాసిన వెన్నెల లాంటి అందం మాత్రం "

ప్రక్కవీధి దత్తుడిగారి దొడ్లో పోట్లగిత్త కట్లు తెంచుకుని, వేసిన భయంకరమైన అంకె ఆ మరుక్షణమే భీతితో అంబా అంబా అని అరుస్తూ, పరుగెత్తుతున్న ఆవు డెక్కల చప్పుడూ

ఒక్కసారి ఉలిక్కిపడింది కన్య.

చీకటి మూపున స్వారిచేస్తూ, పోట్లగిత్త అంకెల్నీ, భీతిల్లిన ఆవు అరుపుల్ని మోసు కొచ్చిన వాయుతరంగం, కన్య కర్ణేంద్రియాల చుట్టూ పనిగట్టుకుని ఎలాసంగా పరిభ్రమించింది.

"ఈ అందం ఎలాగూ అడవిపాలే పోనీ వెన్నెలను నాగరికత మైదానానికి అర్పిస్తే కనీసం తన తమ్ముడికీ, తన నీడైనా కన్పించవచ్చేమో !"

యుగయుగాలుగా జీర్ణించుకుపోయిన సంస్కృతిని నిలువునా కోస్తూ, కదిలిన ఊహతో, కన్య రక్తం సల సల కాగింది.

"ఇంతకుమించి వేరేమార్గం మాత్రం ఏదీ! కాదూ కూడదని పవిత్రంగా నిలుపుకున్నా ఈ కన్నెరికానికి ఏమిటి ప్రయోజనం?? ఎవరు మెచ్చను-మరెవరు వరించను---???

ఇలా అయితే కనీసం ఈ అందానికి ఓ సార్ధకత ఏర్పడినట్లేగా ! అంతకుమించి తమ్ముడి భవిష్యత్తు ఎంత ఆనందంగా ఉంటుంది!"

కన్య ఆలోచనల్ని పసిగట్టింది కాబోలు---కసిగా నవ్వుకుంది చీకటి.

పెళ్ళి కాని కన్య

అందమైన కన్య

కలలు కనీకనీ అలిసి సొలిసిన కన్య

తమ్ముడి ఉద్యోగంకోసం - ఓ ముక్కూ-మొహం తెలీనివాడికి తన కన్యాత్వాన్ని అర్పించుకోడానికి

గడియారం గుండె ఆగిపోయింది.

కాని, అప్పుడు సమయం-రాత్రి మూడు గంటలు

* * *

సూర్యుడు నడినెత్తిమీది కొచ్చాడు.

అద్దాలు బిగించిన ఎర్‌కండిషన్డు గది. పరదాలు దాటలేని తన అశక్తతను తలుచుకుని రోషపడి కాబోలు, న్యూరోటిక్‌లా, ఆఖరు ఊపిరి పీల్చుకుంటున్న చెట్లమీద, నాగరికత, తన చక్రాలక్రింద నిర్దాక్షిణ్యంగా రేప్ చేస్తున్న ఆ నగ్న వేశ్యల్లాంటి రోడ్ల మీదా తన ప్రతాపం చూపిస్తున్నాడు.

ఇంటర్వ్యూకి వచ్చినవాళ్ళు, క్యూలో వరసగా నిలబడి ఉన్నారు---

రేషన్‌షాప్ ముందు, కార్డు పట్టుకుని పంచదారకోసం నిల్చున్నవాళ్ళలా, చేతుల్లో డిగ్రీలు మార్క్సు షీట్సు పట్టుకుని.


క్యూ మెల్లిగా కదులుతోంది-కుమార్ చివరి వాడు

అతని మనసు కల్లోలిత సాగర గర్భంలా వుంది.

అదృష్టం ఈసారీ తనను మోసగిస్తే ??

నిస్పృహ అతన్ని చుట్టుముట్టింది. "నో మోర్ ఇంటర్వ్యూ కుమార్---ది గ్రేట్ గోల్డు మెడలిస్టు విల్ డై యస్ కుమార్ చచ్చిపోతాడు హిజ్ హిస్టరీ విల్ బి రిటెన్

## (వి)చిత్ర విజ్ఞానం



పసిపిల్లల మనోతత్త్వ శాస్త్రజ్ఞుడు, డా॥ ఇర్వింగ్ మార్కోవిట్జ్ అల్లరిపిల్లలను అదుపులోకి తేవడానికి, తల్లీ తండ్రీ — యిద్దరూ సమంగా పాటుపడాలి అంటున్నారు: "ఉండు! ఆఫీసునుంచి మీ నాన్నగారు రానీ: నీ పనిబడతాను!" అని గదమాయించే తల్లి పిల్లవాడికి చులకనై పోతుందట. ఆఫీసునుండి అలిసి సొలిసి వచ్చిన తండ్రి పిల్లవాడి మాట పట్టించుకోపోతే, ఆ తండ్రీ చులకనై పోతాడట! పిల్లవాడి అల్లరి పెరగడమేగాక అతడు "మంచిబాలుడు రాము" అవడం అతికష్టం అంటున్నారు డా॥ ఇర్వింగ్. వీరు అమెరికాలోని న్యూజెర్సీ కుటుంబ-శిశు సంరక్షణ కేంద్రంలో పనిచేస్తున్నారు!

---

ఇన్ గోల్డెన్ లెటర్స్ ఇన్ ది ఎరా ఆఫ్ డెమోక్రసీ భారతదేశపు భావి నిరుద్యోగులు-తన కంచు విగ్రహాన్ని నాలుగురోడ్ల కూడలిల్లో ఆవిష్కరిస్తారు

కవులు-తన జీవితాన్ని, అత్యంత హృదయ విదారకంగా, విషాదగీతికలుగా రచిస్తారు.

"కుమార్ !" ఎవరో చేత్తో తట్టి పిలుస్తున్నట్లనిపించి, ప్రక్కకు తిరిగిచూశాడు.

ఎదురుగా తండ్రీ-అక్కా!

"ఏమిటిలా వచ్చారు?" అన్నాడు ఆశ్చర్యంగా కొంచెం క్యూలోనుండి పక్కకు జరిగి.

పరశురామయ్య చెప్పాలా వద్దా అన్నట్లు తటపటాయించాడు ఓక్షణం.

"చెప్పు నాన్నా—! ఏమిటి సంగతి!" ఆందోళనగా అడిగాడు కుమార్.

"మీ మామయ్య పోయాట్ట. ఇంటర్వ్యూ కాగానే ఇట్నుంచిటు ఊరెళ్లి పోదామని "

నిట్టూర్చాడు కుమార్ "ఆపేక్షలున్నా, లేకపోయినా ఫార్మాలిటీస్ "

"సరే! అలాగే వెళ్లిపోదాం. అక్కడ కూర్చోండి అంతవరకూ!" అంటూ మళ్ళీ క్యూలో సర్దుకున్నాడు.

స్వింగ్డోర్ పక్కనేవున్న బెంచీమీద కూర్చునేందుకు ముందుకువెళ్ళారు పరశురామయ్యా, కన్య.

"బాబూ! తవరక్కడ కూకోటం అయ్యగారు సూత్తే అగ్గి అయిపోతాడు. దానికితోడు ఇంటర్వ్యూలు గూడ నడుత్తుండయ్ ఈ వరండా సివరికెళ్ళితే, కుడిపక్కన ఇంకో వరండా వుంది. అక్కడ కూసోండి సార్!" అన్నాడు ప్యూన్.

మెల్లగా అటువైపు కదిలారు తండ్రీ, కూతుళ్ళు.

క్యూలో కుమార్ కాక, అతనికి ముందు ఇంకా ముగ్గురు మాత్రమే మిగిలారు.

ప్యూన్ కేకతో అందరికంటె ముందున్న తను ఆఫీసర్ గదిలోకి వెళ్ళాడు.

"నే పేరు ?"

"సతీష్ "

" "

" "

వెంటిలేటర్నుండి ఆఫీసర్ గదిలోనుండి విన్పిస్తున్న సంభాషణను యధాలాపంగా వింటున్నారు పరశురామయ్యా, కన్య

"అన్నట్లు పాపం మీ నాన్నగారు ఈ డిపార్టుమెంట్లోనే పనిచేసేవారట కదూ ! అయామ్సారీ ఆయన ఆన్డ్యూటీలో ఏక్సిడెంట్లో

పరశురామయ్యకు కడుపులో ప్రేగు తెగినట్లనిపించింది.

కళ్ళముందు ఓ క్షణం సుందర్రామయ్య రూపం కన్పించింది.

“అంటే-ఈ ఇంటర్వ్యూలో కూడా కుమార్‌కు ”

ఆ తర్వాత ఆలోచించే ధైర్యం లేకపోయింది.

రాత్రి 1 గంటకు ఈ సమస్యకు పరిష్కారంగా తను తీసుకున్న నిర్ణయం

సరైన ఫలితాన్నే ఇస్తుందనిపించింది ఆఫీసర్ మాటల్లోని మార్దవతని బట్టి

గట్టిగా కళ్ళు మూసుకున్నాడు

“నెక్స్ట్ !” కాలింగ్‌బెల్ నొక్కి ప్యూన్‌కు చెప్పాడు ఆఫీసర్.

మెల్లిగా స్వింగ్‌డోర్ తెరిచి, లోపలకు వెళ్ళాడు రెండో అతను కొంచెంగా కుంటుతూ.

అప్పటివరకూ అతని కుంటితనాన్ని గమనించని కుమార్ కళ్ళు క్షణకాలం కుంచించుపోయాయి.

అతని కళ్లు అందించిన ‘మెసేజ్‌ని’ అతని మెదడు చకచకా భావాలుగా మార్చి, ప్రొజెక్టు చేసింది.

“అంటే హి ఈజె క్రిపిల్డ్ ఈ ఉద్యోగం.”

కుమార్ ది గ్రేట్ గోల్డు మెడలిస్టు విల్ డై రిటైరవ్వాల్సిన నాన్ననూ-పెళ్ళి కావాల్సిన కన్యక్కనూ వదిలి

“నో బ్రతుకుతాను వాళ్ళకోసం బ్రతుకుతాను నెక్స్ట్ ఇంటర్వ్యూలో గోల్డు మెడలిస్టు కుమార్ విల్ ఎప్లయ్ యాజ్ క్రిపిల్డ్ కుమార్ !” ఎడంచేతిని కుడిచేత్తో తడుముకుంటూ వెఱ్ఱిగా నవ్వుకున్నాడు.


ఇంతలో కుమార్ ముందున్నతను వెళ్లాడు గదిలోకి.

ఆశనిండిన కళ్ళతో కుంటుకుంటూ, తన ప్రక్కనుండి వెళ్లిపోతున్నతన్ని చూసి అనుకున్నాడు కుమార్, గుడ్‌బై మై క్రిపిల్డ్ అనెంప్లాయ్‌డ్ బ్రదర్. ఈ ఉద్యోగం నీకు వస్తున్నందుకు నాకు జెలసీలేదు. సంతోషంగా వుంది. నాగురించి బాధపడకు. నెక్స్ట్ టైమ్ ఇదుగో ఈ ఎడమచెయ్యిని తీసేసుకుంటా!”

# పులిస్తరాకు

ఆకాశపు అంచుల్లో నిలబడి
చందనం పూసుకున్న చంద్రుణ్ణి పలకరించు
వెలయాలి చీరచెంగులో దూరి
కాటుక పెట్టుకున్న కళ్ళని ముద్దుపెట్టుకో
నేను మాత్రం—
పేదవాడి పగిలిన గుండెల్లోకి ప్రాకి
ఆకలితో దించుకుపోయిన కడుపును కావలించుకుని
గోడవతల పారేసిన పులిస్తరాకులోని
ఎంగిలి మెతుకుల్ని ఏరుకు తింటా.

—ప్రేమ్‌శిల.




"నిన్నెక్కడో చూసినట్లుంది అదీ ఈ పది పదిహేను రోజుల్లోనే ఎక్కడై ఉంటుందబ్బా!" సాలోచనగా అంటున్న ఆఫీసర్ మాటలు విన్పించి, కన్య అశాంతిగా లేచి, తమ్ముడివైపు నడిచింది ధైర్యం చెప్పడానికి.

బయటకు వస్తున్నతను కళ్ళు తుడుచుకుంటూ, జేబులోనుండి, ఏదో బయటకుతీసి, ఒక్కక్షణం తదేకంగా చూశాడు.

అతని వాలకాన్నీ, అతని కన్నీళ్ళనీ చూచిన కన్య మనసు జాలితో కరిగిపోయింది. మానవత్వం అతనికి ధైర్యం చెప్పమని ముందడుగు వేయించింది.

అతని చేతిలో వున్నది చూసి వులిక్కిపడింది కన్య.

ఎవరిదో అమ్మాయి ఫోటో అచ్చు ఆ కుర్రాడి పోలికలే.

"మీ అక్కా?" అక్షరాల్ని కూడదీసుకుంటూ అడిగింది కన్య.

అవునన్నట్లుగా తలూపి వెక్కి వెక్కి ఏడుస్తూ వెళ్ళిపోయాడు అతను. ఇందాక ఆఫీసర్ మాటల్నీ, ఆ కుర్రాడి ప్రవర్తననూ, ఆ అమ్మాయి ఫొటోనూ పక్క పక్క పెట్టి చూసిన కన్య కొయ్యబారిపోయింది.

రాత్రి తనలో కలిగిన భయంకరమైన ఊహకు-తనకంటే ముందే ఓ రూపాన్నిచ్చింది మరో కన్య.

ఇంతలో కుమార్ బయటకొచ్చాడు.

ఏమైందన్నట్లుగా పరశురామయ్యా, కన్యా చూశారు. ఆ చూపుల్లో ఆశలేదు. చైతన్యపు రేఖలేదు.

అద్దం తనకు పట్టనట్లుగా, నిప్పులుచెరిగే సూర్యుడ్ని చూడాలని ప్రయత్నిస్తున్నట్లు ఆకాశంకేసి చూశాడు కుమార్.

ఇంతలో గదిలోనుండి ఆఫీసర్ గొంతు గట్టిగా విన్పించంది.

పి.ఏ. గారా ?

" ఆ ? హైద్రాబాద్‌నుండి ట్రంకాలా! మినిష్టర్‌గారా? గువ్వల చెన్నగారేనా...కనెక్షన్ ఇవ్వండి నమస్తేసార్ నమస్తేసార్ ఏమిటీ ? కాండిడేట్‌ని రేపు పంపిస్తారా. అలాగేసార్ తప్పకుండా ఈ పోస్టు వారికే యిస్తాను అమ్మమ్మమ్మ తవరు చెప్పడమూ, నేను చెయ్యకపోడమూనా "

ఆ తర్వాతి మాటలు అక్కడున్న ముగ్గురికి విన్పించలేదు. □